క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని పోల్ల బజారు, వికాస్ స్కూల్ రోడ్డు, నందమూరి ప్రసాదరావు రోడ్డు, సాయి బాబా టెంపుల్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

23న పేరంటాలమ్మకు గాజుల అలంకరణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఈ నెల 23వ తేదీన గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి సోమవారం తెలిపారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవార్లను గాజులతో అలంకరిస్తామన్నారు. ఈ అలంకరణ నిమిత్తం అమ్మవార్లకు గాజులు ఇవ్వదలచిన భక్తులు ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల లోపు ఆలయంలో అందజేయాలని కోరారు.

డ్రెయినేజీ అభివృద్ధికి చర్యలు



కంకిపాడు: డ్రెయినేజీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. రూ.5 లక్షలతో గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు పందిపాటి సుధాకర్, షేక్ షకార్, శ్రీహరి, శ్రీనివాసరావు, బండారు ప్రవీణ, చెల్లి సంగీతరావు, మన్నె కృప తదితరులు పాల్గొన్నారు.

మండలానికి రూ.5 కోట్ల ఉపాధి నిధులు మంజూరు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 5 కోట్ల రూపాయల ఉపాధి నిధులు మంజూరు చేసిందని ఉపాధి పథకం ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ పి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గ్రామాల్లో ఆ నిధులతో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టేందుకు గాను ఈ నెల 23వ తేదీన ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి పనుల వివరాలను తెలియజేస్తామన్నారు.

ఆధార్ ప్రత్యేక నమోదు శిబిరాలు రద్దు

కంకిపాడు: ఆధార్ ప్రత్యేక నమోదు శిబిరాలు రద్దు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలు తెలుపుతూ సాంకేతిక సమస్యల కారణంగా ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించాల్సి ఉన్న ఆధార్ నమోదు శిబిరాలను రద్దు చేశామని, తదుపరి తేదీలను ప్రకటిస్తామని చెప్పారు.

నున్నలో ఆక్రమణలు తొలగించాలని వినతి



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి ఆక్రమణలు తొలగించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకుడు దండు సుబ్రహ్మణ్యం రాజు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీఓ బి.భార్గవికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

23న ఉపాధి హామీ గ్రామసభలు

ఉంగుటూరు: గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టవలసిన, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించేందుకు ఈ నెల 23న మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు సోమవారం తెలిపారు. గ్రామ స్థాయిలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించనున్న సభల్లో గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులు తెలియజేయాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకుని గ్రామాల్లో ఉన్న పెండింగ్ పనులు, చేయాల్సిన పనులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

యథేచ్ఛగా కాలువ కట్టల ఆక్రమణ

- అడ్డగోలుగా నిర్మాణాలు
- కాసులవేటలో టీడీపీ నేతలు
- బలహీన పడుతున్న కాలువ కట్టలు
- ప్రేక్షకపాత్రకు పరిమితమైన అధికార యంత్రాంగం



గోసాల వైకుంఠపురం సమీపంలో కాలువ కట్టను చదును చేసిన ప్రాంతం

కంకిపాడు: కాలువ కట్టల ఆక్రమణ అడ్డగోలుగా సాగుతోంది. టీడీపీ నేతలు కాలువ కట్టలపై డబ్బు కట్టలు పోగేసుకుంటున్నారు. టీడీపీ అండదండలతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆక్రమణల మాటున చేతి మార్పిడి పేరుతో లక్షల రూపాయలు వెనకేసుకుంటున్నారు. ఇదంతా నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే సాగుతోంది. దీంతో అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారన్న విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.

జాగా కనిపిస్తే... పాగానే..

పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని కంకిపాడు ఇరిగేషన్ సెక్షన్ కింద బందరు కాలువ వెంబడి కంకిపాడు, పెనమలూరు మండలాల పరిధిలో విశాలమైన కాలువ కట్ట ప్రాంతం ఉంది. కాలువ కట్టల పటిష్టతతో ముంపు సమస్యను అధిగమించే విధంగా కట్టలను విస్తరించి సాగునీటి వ్యవస్థను ఏళ్ల నాడు రూపొందించారు. ప్రస్తుతం ఈ కాలువ కట్టలు అక్రమార్కుల చెరలో ఆక్రమణకు గురవుతున్నాయి. ఖాళీ ప్రదేశం కనిపిస్తే పొక్లెయినర్‌లతో కట్టలను చదును చేసి వ్యర్థాలను తొలగిస్తున్నారు. చదును చేసిన ప్రదేశంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలను ఆఘమేఘాల మీద చేపడుతున్నారు.

అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే..

టీడీపీ(కూటమి) సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాలువ కట్టలకు రక్షణ కరువైంది. టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఆక్రమణ పర్వం కొనసాగుతోంది. ప్రధానంగా గోసాల వైకుంఠపురం పరిధిలో ఇటీవల కాలంలో అక్రమ నిర్మాణాలు అడ్డగోలుగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారే తప్ప ఆక్రమణలను పూర్తి స్థాయిలో అడ్డుకోవటం లేదు. ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఆక్రమిస్తే చర్యలు ఉంటాయన్న బోర్డులు కూడా పెట్టడం లేదు. అధికారుల అలసత్వంతో ఆక్రమణదారులు పేట్రేగిపోతున్నారు. సొంత లాభం చూసుకుని ఆక్రమణదారులకు టీడీపీ నేతలు సహాయ సహకారాలు అందిస్తూ డబ్బులు పోగేసుకుంటున్నారు. దీంతో కాలువ కట్టల పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది.

ఆక్రమణల జోలికెళ్తే...ఖబడ్దార్..

పేదలు, స్థానికుల పేరుతో టీడీపీ నేతలు రంగంలోకి దిగి కాలువ కట్టలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. వాస్తవానికి టీడీపీ నేతలే ఆక్రమణలు చేసి చేతి మార్పిడితో సెంటు రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకూ విక్రయించి జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. టీడీపీ నేతల ఆక్రమణల దందాకు నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి పూర్తి సహకారం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఓ శాఖకు సంబంధించి కింద స్థాయి ఉద్యోగులు ఆక్రమణల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తే..'నీకేం సంబంధం..వేషాలు వేస్తే..ఊరుకోను...ఆ పక్కకు ఎందుకు వెళ్లావ్...జాగ్రత్త' అంటూ హుకూం జారీ చేసినట్లు తెలుస్తోంది. ముఖ్య నేత వత్తాసు బలంగా ఉండటంతో టీడీపీ నేతలు దగ్గరుండి మరీ ఇళ్ల నిర్మాణాలను ఆఘమేఘాలపై సాగేలా పర్యవేక్షిస్తున్నారు. అధికారులు మాత్రం ఏం చర్యలు తీసుకోవాలో అర్థం కాక ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలను నిరోధించి కాలువ కట్టల పరిరక్షణకు చర్యలు తీసుకోకపోతే స్థానికంగా ఎన్నో ఏళ్లుగా ఉంటున్న పేదలంతా ఇరిగేషన్ కట్ట ఆక్రమణ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు సమాచారం.

ఘనంగా విఖనస మహర్షి జయంతి వేడుకలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీవైఖానస యూత్ ఫోరం ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి, వైఖనస మహర్షి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎన్.రామాచార్యులు నేతృత్వంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపారు. అనంతరం శ్రీవిఖనస మహర్షి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. ఈ పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ అర్చకులు, భక్తులు సత్కరించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారికి శోభయాత్ర నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన జరిపారు. పరిసరా గ్రామాలకు చెందిన వైఖానసులు, బ్రాహ్మణ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

కోలాటం గురువు అంగటి మృతి



గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామానికి చెందిన కోలాటం, భజన గురువు అంగటి సాంబశివరావు(74) సోమవారం కన్నుమూశారు. భజన పంతులుగా ప్రజలకు చిరపరిచితులైన సాంబశివరావు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కోలాటం గురువుగా ప్రసిద్ధి గాంచారు. గడిచిన 5 దశాబ్దాలకు పైగా ఆయన కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ఖమ్మం జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కోలాట బృందాలకు, చెక్క భజన సమాజాలకు గురువుగా వ్యవహరించి వేలాది మంది శిష్యులను తయారు చేశారు. ఆయన వద్ద కోలాటం, చెక్క భజన నేర్చుకున్న వారు ఎందరో నేడు గురువులుగా రూపొంది ఈ కళలను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళుతున్నారు. భజన పంతులుగా సాంబశివరావును పిలుస్తారు. గడిచిన కొద్ది కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం కలరు. ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. కోలాటం, చెక్కభజన కళలకు ఆయన చేసిన సేవలను గుర్తు తెచ్చుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న పూనూరు గౌతమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ, లక్ష్మణ్‌రెడ్డి

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి, సాయిబాబా వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా ముగిసింది. డార్విన్ గ్రూప్స్ చైర్మన్ దొంతిరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి, భీమవరపు పరమేశ్వర్‌రెడ్డి గ్రామస్తుల సహకారంతో నూతనంగా శ్రీ వెంకటేశ్వరస్వామి, సాయిబాబా మందిరం నిర్మాణాలు చేపట్టారు. ఆలయ నిర్మాణాలు పూర్తికావటంతో ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు జరిపించి శాస్త్రోక్తంగా వేద పండితులతో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరిపించారు. డ్వారిన్ గ్రూప్స్ చైర్మన్ దొంతిరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి, కృపామణి దంపతులు, భీమవరపు పరమేశ్వర్‌రెడ్డి, సుశీల దంపతులు, ఏపీ ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి, ఉషారాణి దంపతులు హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), పూర్ణాహుతి సమర్పించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ విగ్రహ ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను గుంటక వీర నారాయణ రెడ్డి, బొమ్ము లక్ష్మారెడ్డి, గుంటక వెంకట చైతన్య రెడ్డి, గుంటక సూర్య నారాయణరెడ్డి, ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి పర్యవేక్షించారు.

తెంపల్లి మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్ మృతి



గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నిమ్మకూరి విజయ్‌కుమార్(58) ఆదివారం రాత్రి మృతి చెందారు. గ్రామానికి 2013 నుంచి 2018 వరకూ ఆయన సర్పంచ్‌గా పని చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌లో ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామానికి సేవలందించారు. ఆయనకు భార్య, ఇరువురు సంతానం కలరు. శివారు గ్రామం బల్లిపర్రులోని స్వగృహంలో మృతి చెందగా పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ డే



ఫొటోగ్రాఫర్‌ను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఉయ్యూరు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో సోమవారం ఉయ్యూరులో ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు ఇద్రీస్, ఎస్‌ఎం పాషాలను ఘనంగా సత్కరించారు. ఫొటోగ్రఫీ రంగంలో నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ సాయి వెంకట్, ప్రతినిధులు నెల్లి రాంబాబు, దీనవహి ప్రసాద్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బీరప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ



హనుమాన్ జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కె.సీ తారామపురంలో బీరప్పస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయంలో విశేష పూజలు చేశారు. పలువురు భక్తులు బీరప్పస్వామికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

కలకలం రేపుతున్న పేకాట శిబిరాలు

పెనమలూరు: మండల పరిధిలో పేకాట శిబిరాలు కలకలం రేపుతున్నాయి. జనావాసాల మధ్య పేకాట శిబిరాలు నిర్వహిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేకాట శిబిరాల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండల పరిధిలో పేకాట శిబిరాలకు డెన్‌గా మారింది. గతంలో ఈ ప్రాంతంలో పేకాట ఆడాలంటే పేకాట రాయుళ్లు ఇతర ప్రదేశాలకు, రాష్ట్రాలకు తరలి వెళ్లేవారు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేతలు బరి తెగించి డెన్‌లు స్థానికంగా ఏర్పాటు చేస్తున్నారు. అయితే పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించటంతో టీడీపీ నేతలు పేకాట శిబారాలు జనావాసాల్లోనే ఏర్పాటు చేసి కోతముక్క ఆట నిర్వహిస్తున్నారు. మీడియాలో కథనాలు రావటంతో పోలీసులు తూతూమంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా వణుకూరు, పోరంకి, కానూరు గ్రామాల్లో పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. తమ ఇళ్ల మధ్యలోనే పేకాట శిబిరాలు ఉండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. టీడీపీ వర్గాల్లో విభేదాల కారణంగా పేకాట శిబిరాల వ్యవహారం రచ్చగా మారిందని తెలుస్తోంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే.. బాపులపాడు మండలం వీరవల్లి సమీపంలోని ఆంధ్రా పేపర్ మిల్స్ వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై ఈ నెల 18వ తేదీన ఏలూరు జిల్లా పూళ్ల నుంచి గుంటూరు జిల్లా తెనాలి వెళ్తున్న ఆటో మరమ్మతులకు గురై రోడ్డుపై నిల్చిపోయింది. ఈ క్రమంలో ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఉప్పాల రాంబాబు, చిన్నపాటి సాంబశివరావు, తూమాటి శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉప్పాల రాంబాబు సోమవారం మృతి చెందినట్లు వీరవల్లి ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దోమల నియంత్రణకు ప్రాధాన్యం

పటమట(విజయవాడతూర్పు): నగరంలో దోమల నియంత్రణకు ప్రాధాన్యమివ్వాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం కనకదుర్గా నగర్, బుడమేరు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ఐలా, కార్పొరేషన్ సమన్వయంతో నగరపాలక సంస్థ హద్దుల్లో కూడా పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలని ఆదేశించారు. డ్రోన్ ద్వారా జరుగుతున్న ఎంఎల్ ఆయిల్ పిచికారీ విధానాన్ని పరిశీలించారు.

రేపటి భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 21వ తేదీన చేపట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడు లాకులు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సోమవారం సంఘ ప్రతినిధులు నినాదాలు చేశారు. రాజు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా దళిత సంఘాలు సంయుక్తగా ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. దళితులను విచ్ఛిన్నం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వర్గీకరణను సమర్థించే పార్టీలకు రానున్న రోజుల్లో పుట్టగతులు ఉండవని, భూస్థాపితం తప్పదని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్రె చిట్టిబాబు, నేతలు దర్శి శ్రీనివాస్, పి.రామకృష్ణ, సరిహద్దు ఆంథోని పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మంగళవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం తెలిపారు. సర్కిల్ కార్యాలయంలోని రెండో అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగే అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనం అందజేస్తున్న వీఆర్ సిద్ధార్థ యూనివర్సిటీ చాన్సలర్ చౌదరి తదితరులు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కాలేజీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో చాన్సలర్ కేవీ చౌదరి విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్కులు పంపిణీ చేశారు. కాలేజీలో 135 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున రూ.20.25 లక్షల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ కేవీ చౌదరి మాట్లాడుతూ.. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పూర్వవిద్యార్థుల సంఘం ఉపకార వేతనాలు అందజేస్తోందన్నారు. విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించటంపై అభినందించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏపీ రత్నప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పి.రవికుమార్, సీహెచ్.జానకిరామ్‌ప్రసాద్, కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే ప్రత్యేక గుర్తింపు



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



రామకోటేశ్వరరావును సత్కరిస్తున్న టీచర్లు

కంకిపాడు: అంకితభావంతో బాధ్యతలను నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. ఈడుపుగల్లు ప్రైమరీ కాంప్లెక్స్ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన పర్వతనేని వెంకట శ్రీనివాస్‌ను సోమవారం ఈడుపుగల్లులో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ ప్రతినిధిగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్‌పర్సన్ పద్మావతి, ఉపాధ్యాయులు మండవ శ్రీనివాస్, మీనా కుమారి, ముచ్చింతల శ్రీనివాసరావు, రంగ మాధవి, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు. అనంతరం కాంప్లెక్స్ నూతన కార్యదర్శిగా పీవీవీ బీఎల్ మీనాకుమారిని ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు.

విద్యాభివృద్ధికి విశేష కృషి

కంకిపాడు: విద్యాభివృద్ధికి పిడికిటి రామకోటేశ్వరరావు విశేష కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎంఈఓగా పనిచేసి, పునాదిపాడు జెడ్పీ పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా ఈ నెలలో పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా రామకోటేశ్వరరావును ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల కాంప్లెక్స్ సమావేశంలో సోమవారం సన్మానించారు. కాంప్లెక్స్ చైర్‌పర్సన్ పద్మావతి మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రగతి, విద్యార్థుల ఉన్నతి, ఉపాధ్యాయుల సమస్యలపై రామకోటేశ్వరరావు కృషి చేశారని గుర్తుచేశారు. విద్యా రంగానికి ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఎంవీ శ్రీనివాస్, టైటస్‌పాల్, పిచ్చేశ్వరరావు, అవనిగడ్డ వెంకటేశ్వరరావు, విజయరాణి పాల్గొన్నారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



గాజుల అలంకరణలో శ్రీపార్వతీదేవి అమ్మవారు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రభిషేకం, అనంతరం రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అమ్మవారికి గాజుల అలంకరణ

ఆలయంలో శ్రీపార్వతీదేవి అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరిచారు. అనంతరం గాజుల అలంకరణ చేసి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సాయి భక్త బృందం భజన కార్యక్రమాలు చేపట్టారు.

ప్రారంభానికి నోచుకోని వాటర్ ట్యాంక్

- ట్యాంక్ నిర్మించి 13 ఏళ్లు పూర్తి
- పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శలు



నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు నుంచి కానూరు వెళ్లే డొంక రోడ్డులో మండల పరిషత్ పాఠశాల సమీపంలోని వాటర్ ట్యాంక్ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. గ్రామంలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు 2011లో అప్పటి పంచాయతీ బోర్డు ఆధ్వర్యంలో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. మండల పరిషత్ పాఠశాల సమీపంలోని కామన్ స్థలంలో అప్పటి పాలవకర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసి వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఇది జరిగి 13 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఈ ట్యాంక్ ప్రారంభానికి నోచుకోలేదు. వాటర్ పైప్‌లైన్ విస్తరణ జరగక, ట్యాంక్‌కు మోటారును కూడా ఏర్పాటు చేయకపోవడంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి స్థాయిలో అందని తాగునీరు

నగరానికి అనుకుని ఉన్న మేజర్ పంచాయతీ ప్రసాదంపాడు. ఈ గ్రామంలో సుమారు 40వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ గ్రామ జనాభాకు పూర్తి స్థాయిలో సురక్షిత తాగునీరు అందించడంలో పంచాయతీ విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామం మొత్తానికి కేవలం 90, 40 వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌లతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ తాగునీరు కూడా ప్రధాన గ్రామం వరకే పరిమితం కావడంతో కాల్వగట్టు ప్రాంతవాసులు, శివారు ప్రాంతవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. నిర్మాణం పూర్తయి ట్యాంక్ అందుబాటులో ఉన్న పాలకులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంక్‌ను అందుబాటులోకి తీసుకురావాలి

13 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వాటర్ ట్యాంకు నుంచి పైప్‌లైన్ విస్తరణ చేస్తే డెయిరీ ఫామ్ రోడ్డు, సాయిబాబా ఆలయ ఏరియా, సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రాంతం, బీఎంపీఎస్ రోడ్డు, పోల్ల బజారు, మండల పరిషత్ పాఠశాల ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ సర్నాల బాలాజీ గంగారత్నం, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ట్యాంక్ ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.